ప్రజాశక్తి

మంగళవారం 19 డిసెంబర్ 2023 5 విజయనగరం

మెరిట్ లిస్టుపై 21లోగా అభ్యంతరాలు తెలపాలి

విజయనగరం : నగరంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో నాలుగు విభాగాల్లో పోస్టుల నియామకాలకు సంబంధించి తాత్కాలిక మెరిట్ జాబితాను, ఒక కేటగిరీకి సంబంధించి రివైజ్డ్ ప్రొవిజినల్ మెరిట్ జాబితాను ఆన్ లైన్‌లో ఉంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల తెలిపారు. ఎలక్ట్రీషియన్ గ్రేడ్-3, ఆఫీసు సబార్డినేట్, స్టోర్ అటెండెంట్, జనరల్ డ్యూటీ అటెండెంట్ తదితర నాలుగు విభాగాల పోస్టులకు ప్రొవిజనల్ మెరిట్ జాబితాను, ఎలక్ట్రికల్ హెల్పర్‌కు సంబంధించి రివైజ్డ్ ప్రొవిజినల్ మెరిట్ జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరిచామన్నారు. విజయనగరం జిల్లా అధికారిక వెబ్‌సైట్ http://vizianagaram.ap.gov.in లేదా http://vizianagaram.nic.in లోగాని లేదా ప్రభుత్వ వైద్యకళాశాల, విజయనగరం వారి వెబ్‌సైట్ http://gmcvizianagaram.ap.gov.in లోగాని ప్రొవిజినల్ మెరిట్ జాబితాలను పరిశీలించవచ్చున్నారు. అభ్యంతరాలను ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు ప్రభుత్వ వైద్య కళాశాల పనివేళల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయవచ్చుని తెలిపారు. కళాశాలలో పోస్టుల నియామకాల కోసం 20 విభాగాల్లో 63పోస్టుల నియామకానికి నోటిఫికేషన్లు జారీ చేసినట్లు తెలిపారు.

అంగన్వాడీల ఆగ్రహం

విజయనగరం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

- తాళాలు పగులకొట్టిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి
- సమస్యలు పరిష్కరించకుంటే తగిన గుణపాఠం
- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ హెచ్చరిక
- ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంగన్వాడీలు చేపట్టిన సమ్మె రోజురోజుకూ ఉధృతమవుతోంది. ఓవైపు తాము సమ్మె చేస్తుంటే మరోవైపు అధికారులు సచివాలయ సిబ్బందితో కేంద్రాల తాళాలు పగుల కొట్టించడం సరైనది కాదని, వెంటనే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఎపి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన శిబిరం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ బయటకు వచ్చి మా సమస్యలు వినాలని, తాళాలు పగలు కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్‌డిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. ఆర్‌డిఒ ఎప్పటికీ రాకపోవడంతో కార్యాలయం లోపలికి వెళ్లేందుకు అంగన్వాడీలు ప్రయత్నించారు. దీంతో ఒకటవ పట్టణ సిఐ అక్కడ పరిస్థితిని ఆర్‌డిఒకు వివరించారు. మధ్యాహ్నం 1 గంటకు ఆర్‌డిఒ అక్కడికి చేరుకోవడంతో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పైడిరాజు, ఎస్.అనసూయ, కృష్ణవేణి తదితరులు మాట్లాడుతూ జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు తలుపులు తాళాలు బద్దలు కొట్టి లోపల ప్రవేశించడం సరైన పద్ధతి కాదని అన్నారు. కత్తులు, సుత్తులు పట్టుకొని వచ్చి భయభ్రాంతులు సృష్టించే విధంగా వ్యవహరిస్తున్నా రన్నారు. ప్రభుత్వ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టే అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. చాలా కేంద్రాలు అద్దెకు ప్రైవేటు ఇళ్లలో నడుస్తున్నాయని, తాళాలు, తలుపులు బద్దలు కొడితే అంగన్వాడీ వర్కర్స్‌దే బాధ్యత అంటూఅద్దెకు ఇచ్చిన యజమానులు ఆ నష్టాన్ని తమపై వేస్తున్నారని అన్నారు.

ఆర్‌డిఒ సూర్యకళ స్పందిస్తూ సమస్యలు పరిష్కారం కోసం వినతిపత్రాన్ని ప్రభుత్వానికి పంపిస్తానని అన్నారు. కార్యక్రమానికి మద్దతు తెలియజేస్తూ సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ, బి.రమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, ఆశావర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, ఎపి మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్, ఎఐటియుసి నాయకులు డి.అప్పలరాజు, పి.అప్పారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కంది త్రినాథ్, విజయనగరం, ఎస్ కోట,వేపాడ, కొత్తవలస మండలాలు నుంచి అధిక సంఖ్యలో అంగన్వాడీ వర్కర్స్,ఆయాలు పాల్గొన్నారు.

బొబ్బిలి : ఏడో రోజు సమ్మెలో భాగంగా బొబ్బిలి ఆర్‌డిఒ కార్యాలయాన్ని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ముట్టడించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు వి.లక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు ఆధ్వర్యాన ఆర్‌డిఒ సాయిశ్రీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ర్యాలీగా రాష్ట్రీయ రహదారికి చేరుకుని మానవహారం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్.గోపాలం, సురేష్, బి.శ్రీనివాసరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు సుభాషిణి, కామేశ్వరి, ప్రసన్నలక్ష్మి, నిర్మల, అనురాధ, ఉమాగౌరి, తదితరుల్లు పాల్గొన్నారు. అంగన్వాడీలకు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి సంఘీభావం తెలిపారు.

చీపురుపల్లి : చీపురుపల్లిలో అంగన్వాడీలు భారీ ప్రదర్శన చేపట్టారు. చీపురుపల్లి రైల్వే బ్రిడ్జి నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ గాంధీబొమ్మ జంక్షన్, మెయిన్ రోడ్డు, మూడు రోడ్ల కూడలి, శ్రీనివాస సినిమా హాలు జంక్షన్, ఆంజనేయపురం మీదుగా గరివిడి రైల్వే బ్రిడ్జి వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర సాగింది. మూడు రోడ్ల కూడలిలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, ఆర్‌డిఒకు వినతి అందించారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ, జిల్లా నాయకులు అంబళ్ల గౌరినాయుడు, రామ్మూర్తినాయుడు, వరలక్ష్మి, మాలతి, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు బలగ నాగమణి, నాయకులు ఉమ, సరళ, తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

బొబ్బిలిలో మానవహారం చేస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

పంటనష్టం వెయ్యి ఎకరాలే!

ప్రభుత్వ నిబంధనలతో నష్టపోయిన రైతన్న

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పంచపాండవులు ఎంతమంది అంటే మంచం కోళ్ల మాదిరిగా మూడేనంటూ రెండు వేళ్లను చూపుతూ ఒక వేలిని మూసేశాడంట వెనుకటి ఓ వ్యక్తి. జిల్లాలో మిచౌంగ్ తుపాను కారణంగా పంట నష్టాల గణనలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల లెక్కలు కూడా అచ్చంగా అలానే ఉన్నాయి. ఈనెల 4 నుంచి నుంచి 6వ తేదీ వరకు కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో వేలాది ఎకరాల్లో వివిధ పంటనష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేలాది ఎకరాల్లో రైతులు పంటనష్టం చవి చూసినప్పటికీ ప్రభుత్వ నిబంధనల కారణంగా కేవలం 1,054 ఎకరాల్లో మాత్రమే పంటనష్టం జరిగినట్టు గుర్తించారు. దీంతో, చాలా మంది రైతుల పంటనష్టాలు గుర్తింపునకు నోచుకోలేదు.

విజయనగరం జిల్లాలో 2.40లక్షల ఎకరాల్లో వరి సాగవ్వగా 1.60లక్షల ఎకరాల్లో తుపాను ముందు రోజునాటికి కోతలు పూర్తయ్యాయి. ఇందులో దాదాపు లక్ష ఎకరాల్లో వరి చేను పొలాల్లోనే ఉండిపోయింది. ముంపునకు గురికావడంతో తీవ్ర నష్టం జరిగింది. అధికారులు మాత్రం కేవలం 2,790.45 ఎకరాల్లోనే పంట నీటమునిగిపోయిందని ప్రాథమిక అంచనాలు తేల్చారు. పంట నష్టం 33శాతం దాటితేనే గుర్తించాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో కేవలం 21 మండలాల్లో 1,054 ఎకరాల్లో మాత్రమే ముంపునష్టం ఏర్పడినట్టు గుర్తించారు. ఇందులో అత్యధికంగా పూసపాటిరేగ మండలంలో 102.50 ఎకరాలు, డెంకాడలో 72.40 ఎకరాలు, ఎస్.కోటలో 44.50ఎకరాలు, ఎల్.కోట, 25 పంట నష్టం గురైనట్టు స్పష్టం చేశారు. వేపాడ, సంతకవిటి, రేగిడి, మెరకముడిదాం, రాజాం, వంగర మండలాల్లో ఒక్క ఎకరా కూడా పంటనష్టం వాటిల్లలేదని తేల్చారు. ప్రస్తుతం అధికారులు తయారు చేసిన పంటనష్టం, వాటికి సంబంధించిన రైతుల పేర్ల జాబితాను సామాజిక ఆడిట్ కోసం ఆర్‌బికెల్లో ప్రదర్శనకు పెట్టనున్నారు. 22వ తేదీ వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. వీటన్నింటినీ పరిష్కరించి 26వ తేదీ నాటికి ఇన్‌పుట్ సబ్సిడీ కోసం కలెక్టర్ ఆధ్వర్యాన ప్రభుత్వానికి పంపాల్సి వుంటుంది. వీటిని పంపడానికి ముందు విస్తీర్ణం, జరిగిన నష్టం, ఇ-క్రాప్ నమోదు తదితర అంశాలను పున:పరిశీలించాలని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది.

నెల్లిమర్ల మండలంలో నీటి ముంపునకు గురైన వరిచేను (ఫైల్)

'గడపగడపకు..'లో ఎమ్మెల్యేను నిలదీత

పథకాల అమల్లో జాప్యంపై వైసిపి కార్యకర్తల ఆగ్రహం ● అడ్డుకున్న వైస్ ఎంపిపి

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి గ్రామంలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులును వైసిపి కార్యకర్తలు నిలదీశారు. సంక్షేమ పథకాల అమల్లో జాప్యమవుతోందని, ప్రభుత్వ కార్యాలయాలు పూర్తిచేయక పోవడంపై కార్యకర్తలు పుప్పాల సురేష్, బండి అవినాష్, వాలంటీర్ ప్రియాంక నిలదీశారు. సచివాలయ భవనం పూర్తయినా ఇంతవరకు రంగులు వేయకుండా అసంపూర్తిగా ఎందుకు ఉంచారోనని ఎమ్మెల్యేపై మండిపడ్డారు. గ్రామకంఠంలో ఖాతా నెంబరు 97, 319లో నిరుపేదలకు జగనన్న కాలనీకి సంబంధించి ఇళ్ల పట్టాలు ఇచ్చినా ఇంతవరకు ఎందుకు నిర్మాణాలు చేపట్టలేదని ప్రశ్నించారు. ఇళ్లు నిర్మించిన వారికి బిల్లులు చెల్లింపులు కాలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వాలంటీర్ ప్రియాంకకు 8 నెలలుగా జీతం అందలేదని, మండల, జిల్లా స్థాయి స్పందనకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొదర వీధి, చాకలి వీధి, పలు వీధుల్లో జగనన్న ఇళ్ల లబ్ధిదారులు పలు సమస్యలపై ఎమ్మెల్యేను నిలదీశారు. వైస్ ఎంపిపి వి.జగన్మోహనరావు వారిని అడ్డుకుని సర్దిచెప్పారు. పలు సమస్యలపై స్థానిక ఎంపిటిసి మజ్జి శ్రీనివాసరావు, సర్పంచ్ బుడుమూరు పట్టాభిని ఎమ్మెల్యే జోగులు కార్యకర్తల వద్దే ప్రశ్నించారు. సచివాలయం పూర్తయినా, అనివార్య కారణాల వల్ల నిలుపుదల అయిందని వారు చెప్పారు. జగనన్న కాలనీకి సంబంధించి కోర్టులో పిటిషన్ ఉందని తెలిపారు. రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాలకు స్థలాలు లేవని ఎమ్మెల్యేకు వివరించారు. సచివాలయాన్ని అన్ని హంగులతో పూర్తి చేసి తక్షణమే ప్రారంభించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి టంకాల అచ్చెన్నాయుడు, రాయపురెడ్డి కృష్ణారావు, కోదండరావు, వైసిపి నాయకులు శ్రీనివాస రావు, రమేష్, ఎంపిడిఒ శ్యామలకుమారి, హౌసింగ్ ఎఇ జగన్మోహనరావు, ఎపిఒ బి.గోవిందరావు, ఎఒ మురళీకృష్ణ, ఎపిఒ హరినాథ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను నిలదీస్తున్న వైసిపి కార్యకర్తలు

రామతీర్థసాగర్ పనులు అడ్డగింత

పరిహారం చెల్లించాకే చేయాలన్న రైతులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఆర్ఆర్ ప్యాకేజీ పరిహారం చెల్లించే వరకూ రామతీర్థ సాగర్ ప్రాజెక్టు పనులు చేయొద్దని కోరాడపేట గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం దన్నానపేట పరిధి కోరాడపేటలో రామతీర్థ సాగర్ ప్రాజెక్టు పనులను మాజీ సర్పంచ్ గేదెల రాజారావు, మాజీ ఎంపిటిసి కోరాడ శ్రీదేవి ఆధ్వర్యంలో గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గేదెల రాజారావు మాట్లాడుతూ కోరాడపేటకు పునరావాస ప్యాకేజీ ప్రకటించి, ఇంతవరకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించలేదన్నారు. ముఖ్యంగా సర్వే నంబరు 45 నుంచి 54 వరకు 20 ఎకరాల జిరాయితీ భూమి ఉండగా, దాన్ని ప్రభుత్వ భూమంటూ తప్పుగా నమోదు చేసి పరిహారం ఇవ్వక పోవడం దారుణమన్నారు. దీనివల్ల రైతులకు రైతుభరోసా నగదు అందడం లేదని చెప్పారు.

15 ఏళ్లుగా రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాసం కోసం నెల్లిమర్లలో స్థలం కేటాయించి ఏళ్లు గడుస్తున్నా ఆ పనులు ముందుకు సాగలేదన్నారు. పునరావాసం కింద పాత ఇళ్లకు పరిహారం, యువతకు ఉపాధి ప్యాకేజీ కూడా ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

పనులు చేస్తున్న వాహనాన్ని అడ్డుకుని నినాదాలు చేస్తున్న రైతులు

జగనన్నకు చెబుదాంకు 205 వినతులు

ధాన్యం సేకరణపై తనిఖీలు చేయాలి : జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం కోట

కలెక్టరేట్‌లో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్‌డిఒ సూర్యకళ డిప్యూటీ కలెక్టర్లు డి.వెంకటేశ్వర రావు, బి.సుదర్శన దొర, రాజేశ్వరి, సుమబాల, సుధారాణి , తదితరులు వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు వాటి పరిష్కారం కోసం పంపించారు. జగనన్నకు చెబుదాంకు మొత్తం 205 వినతులు అందగా వీటిలో అత్యధికంగా రెవిన్యూ శాఖకు సంబంధించి 134 ఉన్నాయి. ఆయా శాఖలకు అందిన వినతులను సకాలంలో అర్జీదారుల సంతప్తి మేరకు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

నీలయ్యమ్మ సత్రం భూమిని కాపాడాలి

నగరంలోని శిల్పారామంకు ఆనుకొని దేవాదాయశాఖకు చెందిన నీలయమ్మ సత్రం భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, వెంటనే అధికారులు ఆ భూమిని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని టిడిపి నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ కోరారు. సోమవారం స్పందనలో అధికారులకు వినతినిచ్చారు. సర్వే నెంబర్ 366లో ప్రభుత్వ రికార్డుల ప్రకారం దేవాదాయ శాఖ చెందిన భూమి ఉందన్నారు. దేవాదాయ చట్టం ప్రకారం భూములను ఎవరికైనా లీజుకు ఇవ్వదలిస్తే దేవాదాయ శాఖ ద్వారా పత్రికల్లో ప్రకటన ఇచ్చి నియమ నిబంధనలు తెలియపరచి పబ్లిక్ అక్షన్ ద్వారా కేటాయించాల్సిఉందన్నారు. ఇప్పటికే కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి ఎవరిష్టంసారంగా వారు ఆక్రమించుకోవడం జరుగుతుందన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, మండల పార్టీ కార్యదర్శి గంటా పోలి నాయుడు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, మాజీ వైస్ చైర్మన్ కనకల మురళీమోహన్, కంది మురళి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్జీని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సూర్యకళ

ధాన్యం కొనుగోలుపై దృష్టి పెట్టాలి

స్పందన అనంతరం సంయుక్త కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు మొదలైందని, ప్రత్యేకాధికారులు రైతు భరోసా కేంద్రాలను సందర్శించి అన్ని చోట్ల ప్రారంభించింది లేనిదీ తనిఖీలు చేయాలన్నారు. గన్నీ సంచులు ఉన్నదీ లేనిదీ , కొనుగోలులో ఏవైనా సాంకేతికపరమైన సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి గానీ డిఎస్‌ఒ దృష్టికి గానీ తేవాలని సూచించారు.

ఆత్మహత్యే శరణ్యం

'పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చి, ప్రభుత్వ పథకాలు అందించాలని అధికారుల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతున్నా న్యాయం చేయడం లేదు. నాకు ఆత్మహత్యే శరణ్యం' అంటూ నెల్లిమర్ల నగర పంచాయతీ బైరెడ్డివీధికి చెందిన తుర్ల అప్పలనర్సయ్య పురుగుమందు డబ్బా పట్టుకొని స్పందన కార్యక్రమానికి వచ్చాడు. ఈ సందర్భంగా పురుగుమందు డబ్బా చూపిస్తూ అధికారులు తమ సమస్య పరిష్కరించకపోతే మందు తాగి చనిపోతానని అన్నాడు.

అప్పలనర్సయ్యకు నెల్లిమర్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద సర్వే నెంబర్ 74/13, 74/17, 74/53లలో సబ్ డివిజన్ నెంబర్లతో తాత, ముత్తాతల నుంచి సంక్రమించిన 80సెంట్ల భూమి ఉంది. వన్‌బి ఉన్నప్పటికీ పట్టాదారు పాసు పుస్తకాలు లేవు. వీటికోసం గత నాలుగు ఐదు సంవత్సరాల నుండి కలెక్టర్ ఆఫీస్, రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. పాసుపుస్తకం లేక ప్రభుత్వ రాయితీలైన రైతు భరోసా ఇతర పథకాలు అందటం లేదు, ఇదే విషయమై సచివాలయానికి వెళ్లి అడిగితే ఆన్‌లైన్‌లో పేరుంది కానీ, ఎందుకు రాలేదో తమకు తెలియదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ భూమిని కొందరు రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు ఆక్రమించారు. వాళ్ళను అడుగుతుంటే ఇంకెక్కడైనా భూమిస్తామని అంటున్నారు, తన భూమినే తనకు ఇప్పించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందించకపోవడంతో దిక్కులేని పరిస్థితిలో కలెక్టరేట్‌కు వచ్చానని, ఆత్మహత్య చేసుకోవడం మినహా వేరే గత్యంతరం లేదని తెలిపాడు. చనిపోయేకైనా ఈ సమస్య పరిష్కారమైతే నా కుటుంబానికైనా మేలు జరుగుతుందని ఆవేదన చెందాడు. భార్య బిడ్డలతో పూరిపాకలో నివసిస్తున్నానని, ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరాడు. ఇంతలో అక్కడికి చేరుకున్న పోలీసులు అతని వద్దగల పురుగుమందు డబ్బాను లాక్కున్నారు. అక్కడికి వచ్చిన జెడ్‌పి చైర్మన్ దృష్టికి సమస్యను పోలీసులు తీసుకెళ్లగా పరిష్కరిస్తానని ఆయన హామీ ఇవ్వడంతో అప్పలనర్సయ్య వెనుతిరిగాడు.

పురుగుల మందు డబ్బాతో రైతు

ఆరోగ్యశ్రీపై అవగాహన

కొత్త ఆరోగ్యశ్రీ కార్డు అందిస్తున్న జెడ్‌పి చైర్మన్, కలెక్టర్

- పరిమితి రూ.25 లక్షలకు పెంపు
- ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ
- 7.5 లక్షల కుటుంబాలకు లబ్ధి : జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

ఆరోగ్యశ్రీ మెగా అవగాహనా కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ప్రారంభించారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా లైవ్ స్ట్రీమింగ్ ద్వారా సోమవారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఆరోగ్యశ్రీ నూతన స్మార్ట్‌కార్డుల పంపిణీని ప్రారంభించారు. దీనివల్ల జిల్లాలోని సుమారు 7.5లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. ఈ నాలుగున్నర ఏళ్లలో ఒక్క విజయనగరం జిల్లాలోనే ఆరోగ్యశ్రీ పథకం క్రింద సుమారు 2లక్షలా 49 వేల మందికి చికిత్సను అందించడానికి రూ.470 కోట్లను ఖర్చు చేశారు. మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ అవగాహనా కార్యక్రమం, లాంఛనంగా నియోజకవర్గానికి ఐదు గ్రామాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుంది. జనవరి 1 నుంచి జగనన్నఆరోగ్య సురక్ష ఫేజ్-2 ప్రారంభమవు తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. కార్యక్రమం అనంతరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపికా పాటిల్, ఎంఎల్‌సి డాక్టర్ పి.సురేష్‌బాబు, ఎంఎల్‌ఎ బడ్డుకొండ అప్పలనాయుడు ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు నూతన కార్డులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కరరావు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ యు.అప్పలరాజు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ గౌరీశంకర్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ కెవి సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

'మై భారత్'లో నమోదు కావాలి

ఎన్‌వైకె జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్

ప్రజాశక్తి- విజయనగరం

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర సంగటన్ న్యూఢిల్లీ ఆదేశాల మేరకు mybharat.gov.in వెబ్‌సైట్ లో 15-29 మధ్య వయస్సు గల యువత తమ పేర్లను నమోదు చేసుకోవాలని విజయనగరం నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ తెలిపారు. దీనికి సంబంధించిన క్యూఆర్ కోడ్ ను సోమవారం విడుదల చేశారు. ముందుగా యువత తమ వ్యక్తిగత మొబైల్ నెంబర్ రిజిస్టర్ చేసుకుని ఒటిపి నిర్ధారణ తర్వాత తమ పేరు, పుట్టిన తేది, రాష్ట్రం, జిల్లా, రూరల్ /అర్బన్ (మున్సిపాలిటీ లో ఉన్నవారు అర్బన్, పంచాయతీలలో ఉన్నవారు రూరల్), మండల కేంద్రం, పిన్ కోడ్ సమాచారం పొందుపరచి చివరిగా ఎన్‌వైకెఎస్‌ను ఎంచుకొని ప్రాథమికంగా నమోదు చేసుకోవాలని సూచించారు.

సంపూర్ణ పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

నగర అభివృద్ధి తో పాటు సంపూర్ణ పారిశుద్యానికి అధిక ప్రాధాన్యతిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. అందులో భాగంగానే సోమవారం గుణుపూరు పేట లో ఉన్న డంపింగ్ యార్డ్ వద్ద రూ.15 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన బయో రెమిడీయేషన్ లెగ్గసి వేస్ట్ ల్యాండ్ పునరుద్ధరణ ప్రక్రియను ప్రారంభించారు. నగరంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను ప్రత్యేక పారిశుధ్య వాహనాలలో గుణుపూర్ పేటకు తరలించే విషయం అందరికీ తెలిసిందే. అయితే అక్కడ ఉన్న ప్రాంతాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు, ఎప్పటి నుంచో పేరుకుపోయిన చెత్తాచెదారాలను వేరు చేసే కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులు 15 కోట్ల రూపాయలు వెచ్చించి చెత్త వర్గీకరణ యంత్రాలతో పాటు భూమి చదును చేసే ప్రక్రియను కోలగట్ల ప్రారంభించారు. కోలగట్లతో పాటు మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, కమిషనర్ ఆర్ శ్రీ రాములనాయుడు తదితరులు లెగ్గసి వేస్ట్ ల్యాండ్ ప్రక్రియ విధానాన్ని ఆశాంతం పరిశీలించారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ చదును ప్రక్రియ పూర్తయిన తర్వాత 16 ఎకరాల స్థలం నగరపాలక సంస్థ ప్రత్యామ్నాయ వినియోగంలోకి తీసుకు రావచ్చుని తెలిపారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ఇన్చార్జి ఇఇ దక్షిణామూర్తి, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బయో రెమిడియేషన్ వేస్ట్ ల్యాండ్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, మేయర్ విజయలక్ష్మి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయనగరం టౌన్ : నగరంలో వివిధ డివిజన్లలో రూ.80 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నగర మేయయర్ వి.విజయలక్ష్మి సోమవారం శంకుస్థాపన చేశారు. 13, 33, 42, 43, 45, 46 డివిజన్లో వివిధ ప్రాంతాలలో కాలువలు, రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయగా, మరికొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తయిన రహదారులను ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్, జోనల్ ఇంచార్జ్ మారం బాల బ్రహ్మారెడ్డి, 33 వ డివిజన్ కార్పొరేటర్ జివి రంగారావు ముద్దాడ మధు, గదుల సత్యలత, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు ఇసరపు రేవతి దేవి, పిన్నింటి కళావతి, దాసరి సత్యవతి, సంతోష్ కుమారి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాబ్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సాబ్జీకి ఘన నివాళి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

కారు ప్రమాదంలో మరణించిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ సంతాప సభను సోమవారం యుటిఎఫ్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి మాట్లాడుతూ 30 ఏళ్లుగా విద్యారంగానికి, ఉపాధ్యాయ, ఉద్యోగుల హక్కుల కోసం సాబ్జీ చేసిన కృషిని వివరించారు. సాబ్జీ ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, నాయకులు సత్యన్నారాయణ, శ్రీనివాస్ , శంకరరావు, రామకృష్ణ, శ్రీనివాస్, మధుసూదనరావు, రాధాకృష్ణ, అనంత్, చిట్టిబాబు, చంటి, సుధాకర్, కృష్ణదాసు, నాగేశ్వరరావు, పారినాయుడు పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న సిపిఎం నాయకులు రాములు, తదితరులు

సాగుభూములకు పట్టాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-మెంటాడ

దళితులు, గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు.. ట్రెయినీ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు సోమవారం వినతి అందించారు. పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోవడంతో రైతు భరోసా, బ్యాంకు రుణాలు, ఇతరత్రా రాయితీలు పొందలేకపోతున్నారని చెప్పారు. సాగులో ఉన్న భూములను సర్వే చేసి రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పించాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు సన్యాసి, గిరిజన సంఘం మండల కార్యదర్శి తామరాపల్లి సోములు, ఎంఎ నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని చామలాపల్లికి చెందిన దళితుల భూముల అన్యాక్రాంతంపై కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో సామాజిక కార్యకర్త ఆర్.అప్పారావు ఫిర్యాదుచేశారు. ఆర్‌డిఒ సూర్యకళకు ఆయన సమస్యను వివరించారు. దీనిపై ఆర్‌డిఒ స్పందిస్తూ విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల పెన్‌డౌన్

ప్రజాశక్తి వేపాడ

సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న పెన్‌డౌన్ కార్యక్రమం మూడో రోజు సోమవారం కొనసాగింది. ఎంఆర్‌సి, కెజిబివిలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన తెలిపారు.

నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కుళాయి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పెదకృష్ణరాజపురం పరిధిలోని గదబవలసలో 10 వేల లీటర్ల వాటర్ ట్యాంకు, ఇంటింటి కుళాయి పనులకు సోమవారం సర్పంచ్ మమ్ములూరి జగన్నాథం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కిలపర్తి మురళీకృష్ణ, ముమ్ములూరి సత్తిబాబు, గొల్లు రామారావు, పి.కృష్ణ, బీల వెంకట్రావు, ఎర్ర చక్రపాణి, గేదెల బుచ్చిబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కుమారి పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు రికవరీ చేయాలి

ప్రజాశక్తి-రేగిడి

మహిళా సంఘాల బ్యాంకు రుణాలు శత శాతం రికవరీ చేయాలని ఎసి చిరంజీవి అన్నారు. సోమవారం రేగిడి వైకెపి కార్యాలయంలో మహిళా సంఘ ప్రతినిధులు, విఒఎలతో ఎంఎంఎస్‌ఐసి ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. విఒఎలు 'ఎ' గ్రేడ్‌లో ఉండాలని సూచించారు. ఎస్‌సి సబ్‌ప్లాన్ రుణాల రికవరీ వంద శాతం ఉండాలన్నారు. విఒఎలు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షులు సుభాషిణి, ఎపిఎం గోవిందరావు, ఎల్‌సి దదికుమార్, ఎస్‌విఇపి శేషగిరి, ఎస్ఎన్ మేనేజర్ వి.సుధాకర్ పాల్గొన్నారు.

ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థుల పర్యటన

ప్రజాశక్తి- వేపాడ

బెంగళూరుకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థుల బృందం మండలంలో సోమవారం పర్యటించింది. వారి ప్రాజెక్టులో భాగంగా బొద్దాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో మాట్లాడి, వారిని చైతన్యం చేశారు.

హైస్కూల్లో ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు

అంకితభావం ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

దేశం పట్ల అంకితభావం కలిగిన విద్యార్థులను ఉపాధ్యాయులు తయారుచేయాలని లీడ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎన్.బి.సుదర్శన్ ఆచార్య, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్, వెంకటపద్మ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరావు తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఎంపిక చేసి వారిలో దేశం పట్ల, సమాజం పట్ల, విద్యపరంగా స్ఫూర్తిని నింపే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఎన్.బి.సుదర్శన్ ఆచార్య, డాక్టర్ ఎం.వెంకటేశ్వరావు అవగాహన కల్పించారు.

ఎంవిజిఆర్‌లో ఎఫ్‌డిపి

ప్రజాశక్తి-డెంకాడ

ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్ ఆధ్వర్యాన అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించారు. ఆరు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి తొలిరోజు హైదరాబాద్ ఐఐటి ప్రొఫెసర్ డాక్టర్ కెవిఎల్ సుబ్రమణ్యం హాజరయ్యారు. దేశ ఆర్థిక వృద్ధిని దిశానిర్దేశం చేయడంలో నిర్మాణంలో స్థిరత్వం, నికర-జీరో పరిగణనలనే అంశం చాలా కీలకమైనదని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వైఎంసి శేఖర్, ప్రొఫెసర్ మార్కండేయరాజు, మురళీసాగర్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్

అంగన్వాడీలు లేని కేంద్రాలకు పిల్లలను పంపం

బలవంతంగా కేంద్రాలు తెరవడంపై తల్లిదండ్రుల ఆగ్రహం • చిన్నారులను పంపేందుకు ససేమిరా

'ఎన్నో ఏళ్లుగా అంగన్వాడీ కార్యకర్తలపై ఉన్న నమ్మకమే...మా చిన్నారులను ఆ కేంద్రాలకు పంపేలా చేస్తోంది. ఈ రోజు వారు లేని అంగన్వాడీ కేంద్రాలకు పిల్లల్ని ఎలా పంపాలి..? అల్లారు ముద్దుగా పెంచుకునే పిల్లలకు అంగన్వాడీ ఆయా, టీచర్ కన్న తల్లుల్లా చూసుకునే వారు. వారి ఇష్టాఇష్టాలు, వారి బాగోగులు చూసుకోవడంలో తల్లులను మించిపోయారు. అలాంటి వారు వారి సమస్యల గురించి పోరాడుతుంటే, ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం ఎంతో బాధేస్తుంది. మా పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాది వేసే, అంగన్వాడీ కేంద్రాలపై ప్రభుత్వం నిరంకుశ చర్యలు...మా పిల్లలపై పడవద్దు...అందుకే పిల్లల్ని కేంద్రాలకు పంపించే ప్రసక్తే లేదు...!' అంటూ చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆరు రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం అధికారులు, సచివాలయ సిబ్బందితో కేంద్రాల తాళాలు పగులగొట్టి బలవంతంగా తెరుస్తున్నారు. అయినా పిల్లలెవరూ కేంద్రాలకు వెళ్లడం లేదు.

ప్రజాశక్తి - జామి

గత కొద్ది రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. తమ సమస్యలు పరిష్కరించాలని ఎన్నో వినతులు, అభ్యర్థనలు చేసుకున్న కార్యకర్తలు ప్రస్తుతం సమ్మెకు దిగారు. ఇది ప్రజాసామ్యంలో భాగమే అయినప్పటికీ, ప్రభుత్వానికి నచ్చలేదు. ఈ నేపథ్యంలోనే ఇటీవల సచివాలయం సిబ్బంది, పోలీసులు, అధికారులు కలిసి అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు బద్దలు కొట్టి మరి కేంద్రాలు తెరిచారు. తొలుత కేంద్రాలు తాళాలు బద్దలు కొట్టడాన్ని తల్లిదండ్రులు అడ్డుకున్నారు. కానీ అధికారులు పోలీసుల సాయంతో బలవంతంగా కేంద్రాలు తెరిచారు. కానీ ఆ కేంద్రాలకు పిల్లలను మాత్రం తల్లింద్రులు పంపడం లేదు. నమ్మకం లేని చోటుకు పిల్లల్ని ఎలా పంపాలని ప్రశ్నిస్తున్నారు.

మండలంలో 74 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 150 మంది వరకు కార్యకర్తలు పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు బాలల చదువుకు పునాది వేస్తున్నారు. మండలంలో సుమారుగా రెండు వేల మందికి పైగా చిన్నారులకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నారు. ఒకవైపు అక్షరాలతో పాటు ఆట పాటలు నేర్పిస్తున్నారు. మరో వైపు ప్రభుత్వం చెబుతున్న ఎన్నికల ప్రక్రియ పనులు, ఇతర అదేశాలను అమలు చేయడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తుందన్న ఆశతో దశాబ్దాలుగా చాలీ చాలని జీతాలతో వెట్టి చాకిరి చేస్తున్నారు. ఎన్నికలముందు జగన్మోహన్‌రెడ్డి సైతం అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కానీ ఐదేళ్లయినా పరిష్కరించలేదు. ఈ నేపథ్యంలోనే అంగన్‌వాడీలంతా సమ్మె బాట పట్టారు. కానీ ప్రభుత్వం నిరంకుశంగా సమ్మెను విచ్ఛిన్నం చేయాలని పూనుకుంది. అందులో భాగంగా కేంద్రాలు తెరవకపోతే ఉద్యోగాలు ఉండవని బెదిరించారు. చివరికి కేంద్రాలు బాధ్యత సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లకు అప్పగించారు. కానీ ప్రభుత్వ బెదిరింపులకు జడవకుండా అంగన్వాడీలు సమ్మె కొనసాగిస్తున్నారు. వీరికి పిల్లల తల్లిదండ్రుల నుంచి మద్దతు లభిస్తోంది. సమ్మె చేస్తున్న వారితో సంప్రదించి, వారికి న్యాయం చేకుండా, బెదిరించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం సచివాలయం సిబ్బంది ని పెట్టి కేంద్రాలు తెరిచినా, పిల్లలను మాత్రం పంపించలేదు. ఒక్క జామిలోనే కాదు, జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి.

జామి మండల కేంద్రంలోని అల్లువీధి అంగన్వాడీ కేంద్రాన్ని తెరిచేందుకు వచ్చిన అధికారులను అడ్డుకుంటున్న చిన్నారుల తల్లిదండ్రులు (ఫైల్)

పిల్లల ఆలనా పాలన ఎవరు చూస్తారు?

ప్రజాస్వామ్యంగా సమ్మె చేస్తున్న వారిపై ప్రభుత్వం నిరంకుశ చర్యలకు దిగడం బాధాకరం. పిల్లలను నమ్మకంగా చూసుకునే వారు లేకపోతే కేంద్రాలకు ఎలా పంపాలి. ఇప్పటికైనా మొండి వైఖరి వీడి, పిల్లలకు, అంగన్వాడీ కార్యకర్తలకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలి.

- కొంచాడ సావిత్రి, తల్లి, జామి

ఆయా లేని చోటికి ఏ నమ్మకంతో పంపాలి

అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె లో ఉంటే, పిల్లలను ఏ నమ్మకంతో కేంద్రాలకు పంపాలి. మా పిల్లల బాగోగులు చూసుకునే వారు లేనప్పుడు ఏవిధంగా పిల్లలకు రక్షణ ఉంటుంది. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం సమస్యలు సృష్టిస్తే ఎలా? ప్రభుత్వమే దొడ్డి దారుల్లో కేంద్రాలు తెరవడం విడ్డూరంగా ఉంది.

- బొంతల కోటి భాగ్యలక్ష్మి, తల్లి, జామి

సిట్టింగుల్లో గుబులు

• బొబ్బిలి, రాజాంలో అభ్యర్థులను మార్చవచ్చని చర్చ

• మిగిలిన వారిలో ఒకరిద్దరికి స్థానచలం..?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాకు చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో గుబులు మొదలైంది. అధినేత జగన్ తిరిగి అవకాశమిస్తారా? లేదా? అని కొంతమంది ఉత్కంఠకు గురౌతుండగా, స్థానచలనం ఉంటుందేమోనన్న ఆత్రుతతో కొంతమంది ఉన్నారు. జిల్లాలో ఇద్దరు సిట్టింగ్‌లకు ఈసారి అనుమానమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పలు సందర్భాల్లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని సమర్థించిన బిఆర్ఎస్ తెలంగాణాలో అధికారాన్ని కోల్పోవడం, అందులోనూ ఎక్కువ మంది సిట్టింగ్‌లు ఓటమి చవి చూడడంతో వైసిపి ప్రభుత్వం ఎన్నికల వ్యూహానికి పదును పెట్టింది. ప్రజావ్యతిరేక ఉన్న ఎమ్మెల్యేలను పక్కనబెట్టడంతో పాటు, ప్రభుత్వంలో కీలకంగావున్న ఎమ్మెల్యేలను అవసరమైతే స్థానం చలనం చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లాలో బొబ్బిలి, రాజాం ఎమ్మెల్యేలకు తిరిగి అవకాశం ఉండకపోవచ్చనే చర్చసాగుతోంది. బొబ్బిలిలో టిడిపి తరపున రంగంలోకి దిగబోయే బేబీ నాయన కాస్త పట్టున్న నాయకుడు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా అంతటా టిడిపి ఓటమి చవిచూసినప్పటికీ బొబ్బిలి నియోకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ గట్టిపోటీ ఇచ్చింది. దీనికితోడు వైసిపికి చెందిన స్థానిక ఎమ్మెల్యే ప్రజావ్యతిరేక పనులు చేశారని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు కూడా కట్టుబడి పనిచేయలేదని స్థానికంగా చర్చనడుస్తోంది. ముఖ్యంగా బొబ్బిలిలోని లక్ష్మీశ్రీనివాస జ్యూట్‌మిల్లును తెరిపిస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఎమ్మెల్యే నిలబెట్టుకోలేదు. పైగా మిల్లు స్థలాన్ని రియల్ ఎస్టేట్‌గా మార్చేందుకు సహకరించారనే విమర్శలు కూడా ఉన్నాయి. తోటపల్లి కాలువ ద్వారా తలపెట్టిన ఎత్తిపోతల పథకాన్ని కూడా నెరవేర్చలేదు. వీటితోపాటు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించడంలోనూ వెనుకబడ్డారు. ఈనేపథ్యంలో ప్రజల్లో వ్యతిరేకత ఉంది. అటు రాజాంలో పార్టీ నాయకత్వాన్ని ఏకతాటిపై నడిపించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యా రన్న విమర్శలు ఉన్నాయి. స్థానిక సమస్యల పరిష్కారానికి నోచుకోపోవడంతోపాటు చిన్న చితక పంచాయితీలను కూడా ఎప్పటికప్పుడు పరిష్కరించలేక పోయారు. నియోజకవర్గ కేంద్రంలో రహదారులు కూడా పూర్తి చేకయపోవడంతో ఇటీవల ప్రజలనుంచి వ్యతిరేకత పెరిగింది. మరోవైపు టిడిపి తరపున రంగంలోకి దిగబోయే అభ్యర్థి కూడా కాస్త బలమైన నాయకుడేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరు ఎమ్మెల్యేలనూ వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి పక్కన బెట్టవచ్చనే చర్చ నడుస్తోంది. మిగిలిన ఐదుగురిలో ఒకరు లేదా ఇద్దర్ని స్థానం చలనం చేయవచ్చని కూడా విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడులను పరస్పరం జంబ్లింగ్ చేయవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండిని బొబ్బిలి పంపినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని కూడా చర్చనడుస్తోంది. ఎమ్మెల్యేలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత కారణంగానే టిక్కెట్లు ఇవ్వకపోవడం, లేదా జంబ్లింగ్ చేయడం వంటి నిర్ణయాలు అధినేత జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నారని మరికొంత మంది నోట వినిపిస్తున్న మాట. త్వరలోనే ఉత్తరాంధ్రలో నియోజకవర్గ ఇన్‌ఛార్జుల మార్పుపై వైసిపి ప్రకటన ఉండవచ్చని ఆ పార్టీకి చెందిన నాయకులే భావిస్తున్నారు. దీనికి ముందు రాజకీయంలో ఆరితేరిన మంత్రి బొత్సతో చర్చిస్తారని, ఆ తరువాతే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో అధికార పార్టీకి చెందిన సిట్టింగులందరిలోనూ లోలోపల గుబులు మొదలైంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బాడంగి

రైతులకు అన్యాయం జరగకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా అత్యంత పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. సోమవారం బాడంగిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ దళారులు, మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ శిరీషా, ఎంపిడిఒ ఆంజనేయులు, సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జామి : మండలంలో ధాన్యం కొనుగోలు ప్రారంభమైంది. కుమరాం, ఎం.కె.వలస, అట్టాడ గ్రామాల్లో వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు ప్రారంభించారు. కార్యక్రమంలో కుమరాం సర్పంచ్ వెంకటలక్ష్మి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఎంపిడిఒ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. అనంతరం ఎంపిడిఒ శేషుబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు, గ్రీన్‌అంబాసిడర్ల బకాయి జీతాలు చెల్లించి, వేతనాల పెంపుపై హైకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు చెలికాని ముత్యాలు, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు బోని రామారావు, గ్రీన్ అంబాసిడర్ల సంఘం మండల కార్యదర్శి బి.గంగరాజు, సభ్యులు పి.నాగరాజు, జి.అప్పారావు, ఎం.దేవ, టి.సన్నిబాబు, డి.శివ, ఆర్.మహేశ్వరరావు, ఆర్.సూర్యుడు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ప్రయాణికులకు బహుమతులు

విజయనగరం కోట : ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించిన వారికి ఆ సంస్థ సోమవారం విజయనగరం డిపోలో బహుమతులు అందజేసింది. విజయనగరం డిపో నుంచి సింహాచలం, ఆంధ్ర, చీపురుపల్లి-మెరకముడిదాం, విజయనగరం-జామి, ఎస్.కోట మార్గాల్లో నడుపుతున్న ఆర్టీసీ బస్సులో డిసెంబర్ 1నుంచి 15వ తేదీ వరకు బస్సులో రూట్లలో ప్రయాణం చేసిన ప్రయాణికులు టికెట్స్ ఆధారంగా డ్రా తీసి ప్రజా రవాణా అధికారి సిహెచ్.అప్పలనారాయణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజరు బి. ఆదినారాయణ, ఎస్‌టిఐ పి.రామారావు, స్టేషన్ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

యువగళం సభను విజయవంతం చేయండి

మాజీ డిప్యూటీ స్పీకర్ వేదవ్యాస్

ప్రజాశక్తి-చీపురుపల్లి

యువగళం ముగింపు సభను విజయవంతం చేయాలని అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ బి.వేదవ్యాస్ టిడిపి శ్రేణులను కోరారు. సోమవారం చీపురుపల్లిలో కిమిడి నాగార్జున క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి కిమిడి మృణాళినితో కలిసి ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అక్రమ పాలన సాగుతోందని, వైసిపి ప్రభుత్వం పోతేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బురగడ్డ కృష్ణతేజ్, పైల బలరాం, వెన్నె సన్యాసినాయుడు, దన్నాన రామచంద్రుడు, తాడ్డే సన్యాసినాయుడు, సారేపాక సురేష్, మహంతి అప్పలనాయుడు, శనపతి శ్రీనివాసరావు, గవిడి నాగరాజు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : జగన్‌రెడ్డి విధ్వంస పాలనకి చరమగీతం పాడేందుకు విజయనగరం జిల్లా నుంచే సమిష్టిగా సమరశంఖం పూరించాలని జనసేన నాయకులు గురాన అయ్యలు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న యువగళం - నవశకం బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

శృంగవరపుకోట : ఈ నెల 20న జరిగే యువగళం పాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ కోరారు. సోమవారం శృంగవరపుకోటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భోగాపురం మండలం పోలిపల్లి వద్ద జరిగే బహిరంగ సభకు టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ హాజరుకానున్నారని తెలిపారు. నియోజక వర్గంలోని టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు తరలిరావాలని కోరారు.

వేపాడ : యువగళం ముగింపు సభను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు కోరారు. మండలంలోని టిడిపి నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు, యువత తరలిరావాలని కోరారు.

బొబ్బిలి : పోలిపల్లిలో జరిగే యువగళం ముగింపు సభను జయప్రదం చేయాలని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి వేర్వేరుగా ఒక ప్రకటనలో కోరారు.

డెంకాడ.. మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ పరిశీలకులు నాని

50 వేల మంది తరలింపు

డెంకాడ : యువగళం ముగింపు సభకు నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి 50 వేల మందిని తరలించాలని టిడిపి నియోజకవర్గ పరిశీలకులు పులివర్తి నాని కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జన సమీకరణ కోసం సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని, ప్రతి ఇంటికెళ్లి సభకు ఆహ్వానించాలని సూచించారు. సమావేశంలో టిడిపి మరో పరిశీలకుడు ఎల్.ఎల్.నాయుడు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పతివాడ అప్పలనారాయణ, నాయకులు రాణి రాజు, భాస్కరరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని రంగరాయపురం గ్రామంలో ఎస్‌డబ్ల్యుఎల్‌ఎ స్థలంలో ఉన్న ఆక్రమణలను తహశీల్దార్ డి.రాజేశ్వరరావు సోమవారం పరిశీలించారు. ఆ స్థలం ప్రభుత్వ భూమి అని, ఆక్రమణలు తొలగించి, బోర్డు ఏర్పాటు చేయాలని విఆర్‌ఒను ఆదేశించించారు.

ఇకెవైసి పరిశీలిస్తున్న తహశీల్దార్ రాజేశ్వరరావు

భూ హక్కు ఇకెవైసి పరిశీలన.. రంగరాయపురంలో డి పట్టాదారులకు ఇకెవైసి చేస్తున్న ప్రక్రియను తహశీల్దార్ పరిశీలించారు. మండలంలో 19 గ్రామాలకు చెందిన 165 మంది రైతులకు చెందిన 122.60 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించినట్లు ఆయన తెలిపారు. ఆయనతోపాటు ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియాది కీలకపాత్ర

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియాది కీలకపాత్ర అని జిల్లా ఎస్‌పి దీపిక అన్నారు. సోమవారం వాజీ ఛానల్ఎమ్‌డి గణపతినీడి శ్రీనివాసరావు ఎస్‌పిని కలిశారు. వాజీ ఛానల్ ఆధ్వర్యాన ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ నాణ్యమైన, నమ్మకమైన, పారదర్శక వార్తాప్రసారాలు అందించే మీడియా ఎప్పుడూ సమాజంలో ప్రధాన పాత్ర పోషించి దిశానిర్దేశం చేస్తుందని అన్నారు.

రామతీర్థం హుండీ ఆదాయం రూ.29.87 లక్షలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.29.87 లక్షలు వచ్చింది. సోమవారం దేవస్థానం ఆవరణలో ఆదాయం హుండీల లెక్కింపు చేపట్టారు. ఆగస్టు 11 నుంచి సోమవారం వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. దేవాదాయ శాఖ అధికారి పి.వి.లక్ష్మి పర్యవేక్షించారు. ట్రస్ట్ బోర్డ్ సభ్యులు దాట్ల. సత్యనారాయణ రాజు, బుర్లే సత్యం, తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల వినతి

గంట్యాడ : విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షులు పీరుబండి ఎరుకలమ్మ ఆధ్వర్యాన సోమవారం తహశీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ఎం.రాము, కోశాధికారి ఎర్రినాయుడు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయునికి సత్కారం

రామభద్రపురం : విశ్రాంత ఉపాధ్యాయులు ఎర్రా కూర్మన్నను రోటరీ క్లబ్ బొబ్బిలి పట్టణ అధ్యక్షులు జెసి రాజు సత్కరించారు. నాయుడువలసలోని ఆయన స్వగృహంలో సత్కరించి, పండ్లను అందించి పెన్షనర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నగర పంచాయతీలో గడపగడపకు...

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలో పరిధిలోని ఏడో వార్డులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వైసిపి నగర పంచాయతీ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, కార్పొరేషన్ డైరెక్టర్లు మద్దిల వాసు, ఎన్.శ్రీనివాసరావు, వైసిపి జిల్లా కార్యదర్శి గంటా సతీష్ పాల్గొన్నారు.